www.ninadam.in

# నినాదం

తెలుగు దిన పత్రిక

నిఖార్సైన జర్నలిజం

EVENING 6 PM

డిజిటల్ ఎడిషన్

సోమవారం ఏప్రిల్ 20 2026

ninadam.in



## నేతాజీపై పదేపదే పిటిషన్లా?
# సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం

- నేతాజీపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని కొట్టివేసిన సుప్రీంకోర్టు
- నేతాజీని 'జాతీయ పుత్రుడిగా' ప్రకటించాలన్న వినతి తిరస్కరణ
- పదేపదే ఇలాంటి పిటిషన్లు వేయొద్దని పిటిషనర్‌కు తీవ్ర హెచ్చరిక
- చారిత్రక అంశాలపై తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసిన ధర్మాసనం
- గతంలో నేతాజీ అస్థికలపైనా ఇలాంటి పిటిషన్‌ను తిరస్కరించిన వైనం

2లో

## పాక్ చర్చలకు బ్రేక్..
## అమెరికాపై ప్రతీకారం తీర్చుకుంటామన్న ఇరాన్

- ఇరాన్‌కు చెందిన కార్గో నౌకను స్వాధీనం చేసుకున్న అమెరికా
- పాకిస్థాన్‌లో జరగాల్సిన శాంతి చర్చలకు హాజరుకాబోమని ప్రకటన
- రెండు రోజుల్లో ముగియనున్న కాల్పుల విరమణ ఒప్పందం
- ఒప్పందం కుదరకపోతే తీవ్ర పరిణామాలుంటాయని ట్రంప్ వార్నింగ్




2లో

## హర్మూజ్ జలసంధి వద్ద భారత నౌకలపై కాల్పులు..

- రెండు రోజుల క్రితం భారత జెండా కలిగిన నౌకలపై కాల్పులు
- కాల్పులు జరిపింది మా బలగాలేనా దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడి

ఢిల్లీ, ఏప్రిల్ 24 (నినాదం) : హర్మూజ్ జలసంధిలో ఇటీవల రెండు భారత నౌకలపై కాల్పులు జరిపిన ఘటనపై ఇరాన్

2లో





## హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు గుడ్ న్యూస్..
## ఉదయం 5 గంటలకే సర్వీసులు?

హైదరాబాద్, ఏప్రిల్ 24 (నినాదం) : హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు త్వరలోనే ఒక శుభవార్త అందే అవకాశాలు కనిపిస్తున్నాయి. నగరంలో మెట్రో రైలు సేవల ప్రారంభ సమయాన్ని ఉదయం 6 గంటల నుంచి 5 గంటలకు మార్చే ప్రతిపాదన మళ్లీ ఊపందుకుంది. ఈ

2లో




## జపాన్‌లో 7.4 తీవ్రతతో
# భారీ భూకంపం

సునామీ హెచ్చరికలు జారీ చేసిన అధికారులు

2లో

## ఎమ్మెల్సీల ఫైల్‌పై
# ఉత్కంఠ..



### సీఎం వినతితో గవర్నర్ ఆమోదంస్తారా అన్న ఉత్కంఠ



### 30 వరకు అజారుద్దీన్ మంత్రి పదవి
### ఈలోగా ఎమ్మెల్సీగా గవర్నర్ ఆమోదించాలి
### గవర్నర్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

హైదరాబాద్, ఏప్రిల్ 24 (నినాదం) : కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కోదండరాం, అమీర్ అలీఖాన్ పేర్లను మంత్రివర్గం సిఫార్సు చేసింది. దీన్ని బీఆర్ఎస్ నేతలు న్యాయస్థానంలో సవాల్ చేశారు. ఇద్దరి ఎమ్మెల్సీ పదవులను సుప్రీంకోర్టు కొట్టేసింది. ఆ తర్వాత మంత్రివర్గం అమీర్ అలీఖాన్ స్థానంలో అజారుద్దీన్ పేరును చేర్చి.. మళ్లీ కోదండరాం, అజారుద్దీన్ పేర్లను సిఫార్సు చేసింది కానీ, విషయం న్యాయస్థానంలో ఉండటంతో వారు ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేయలేదు. తెలంగాణలో ఎమ్మెల్సీల ఎంపికకు తమ ఉత్తర్వులు అడ్డుకావని ఇటీవల సుప్రీంకోర్టు చెప్పిన నేపథ్యంలో.. గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న ఎమ్మెల్సీ ఫైల్ క్లియరెన్స్ కోసం సీఎం రేవంత్ రెడ్డి గవర్నర్‌ను కలిసినట్టు సమాచారం. వీరిద్దరి అభ్యర్థిత్వాలను ఆమోదించాలని కోరారు. ఈ వారం, పదిరోజుల్లో గవర్నర్ ఆమోదిస్తే అజారుద్దీన్ మంత్రిగా ఉంటారు. లేదంటే మళ్లీ మాజీ కాక తప్పదు. గవర్నర్ కోర్టులో ఇప్పుడు బాల్ ఉంది.

2లో

*గతేదాది అక్టోబర్ 31న అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. నిబంధనల ప్రకారం చట్టసభల్లో సభ్యుడు కాకుండా మంత్రి పదవి చేపడితే కచ్చితంగా ఆరు నెలల్లో ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీగా ఎన్నిక కావాల్సి ఉంటుంది. అజారుద్దీన్‌కు ఈ నెల 30తో ఆ గడువు ముగుస్తుంది. ఈలోగా ఆయన ఎమ్మెల్సీ కాకపోతే మంత్రి పదవికి రాజీనామా చేయక తప్పదు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ముందు హడావిడిగా ఆయనను కేబినెట్‌లోకి తీసుకున్నారు. ప్రస్తుతం గవర్నర్ కోటాలో రెండు ఎమ్మెల్సీ పదవులు ఖాళీగా ఉన్నాయి. వీటిపై గత బీఆర్ఎస్ నుంచి వివాదాలు కొనసాగుతున్నాయి .*



## రేపు రాజస్థాన్‌లో మోదీ ప్రారంభించాల్సిన రిఫైనరీలో
# నేడు భారీ అగ్నిప్రమాదం

### రాజస్థాన్ హెచ్‌పీసీఎల్ రిఫైనరీలో అగ్నిప్రమాదం
### ప్రధాని మోదీ ప్రారంభోత్సవానికి ఒకరోజు ముందు ఘటన


బలోత్రా ఏప్రిల్ 24 (నినాదం) : రాజస్థాన్‌లోని బలోత్రా జిల్లా పచ్‌పద్రాలో ఉన్న హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) రిఫైనరీలో సోమవారం అగ్నిప్రమాదం సంభవించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు (ఏప్రిల్ 21) మంగళవారం ఈ రిఫైనరీని ప్రారంభించాల్సి ఉండగా, ఒక్కరోజు ముందే ఈ ఘటన జరగడం తీవ్ర కలకలం రేపింది. దేశంలోనే తొలి గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ రిఫైనరీ కమ్ పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌గా దీనిని నిర్మించారు. హెచ్‌పీసీఎల్, రాజస్థాన్ ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో

2లో

## తెచ్చుకున్న తెలంగాణను
# ఆగం చేశారు

### ప్రజలఆశలపై మట్టి కొట్టారు
### అవినీతి అక్రమాలతో నట్టేట ముంచారు

### హరీష్ రావు విమర్శలపై మండిపడ్డ మంత్రి తుమ్మల



ఖమ్మం, ఏప్రిల్ 24 (నినాదం) : గత పది సంవత్సరాలు ప్రజలు తెచ్చుకున్న తెలంగాణలో ప్రజల ఆశలపై మట్టి కొట్టి మన్ను పోశారని బిఆర్ఎస్‌పై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరోపించారు. రాజకీయ పార్టీలను మోసం చేసి, ప్రజలను వంచించి, వ్యవస్థలను దోచుకున్నారని విమర్శించారు. అవినీతి, అక్రమాలతో రాష్ట్రాన్ని రావణ కాష్టం చేశారని మండిపడ్డారు. ఈ మేరకు మాజీ మంత్రి హరీశ్ రావుపై మంత్రి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. అన్ని రాజకీయ పార్టీల విలువలను కాదని, పూర్వీకుల మాట పక్కన పెట్టి అహంకారంతో, దౌర్జన్యంతో పాలన చేశారని మంత్రి అన్నారు. ఒక్కొక్కరిపై వందల కేసులు పెట్టి, కబ్జా కోరులు కబ్జా చేసిన స్థలంలో మీటింగ్ పెట్టి పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని తుమ్మల వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్‌లో కాలేశ్వరరావు అనే హరీశ్ రావు రాజకీయ భవిష్యత్తు అంధకారం లో ఉందని, ఏం చేయాలో దిక్కు తోచని స్థితిలో మాజీ మంత్రి మాట్లాడుతున్నారని విమర్శించారు. టీఆర్ఎస్‌లో గతంలో జరిగిన, ప్రస్తుతం జరుగుతున్న అవమానాలతో ఆయన మానసిక స్థితి సరిగా లేదన్నారు. హరీశ్ రావు మానసిక వేదనతో బాధపడుతున్నారని, అది దౌర్భాగ్యమో లేక మరేదైనా కావచ్చని మంత్రి అన్నారు. ఆయనకు ఒక్కటే పని.. ఎక్కడికి వెళ్లినా ఒకే ఆవు కథ, ఒకే రికార్డింగ్ క్యాసెట్ వినిపించడమని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పదవి పోయిన బాధలో, అస్తిత్వంతో టీఆర్ఎస్ నాయకులు ఇతర పార్టీలను విమర్శిస్తున్నారని

2లో


## కేసీఆర్ జగిత్యాల సభకు
## హరీశ్ రావు గైర్హాజరు..

### తెర వెనుక కీలక వ్యూహం!

- చాలా రోజుల తర్వాత జగిత్యాలలో కేసీఆర్ బహిరంగ సభ
- ఈ కీలక సభకు దూరంగా హరీశ్ రావు.. హుటాహుటిన ఢిల్లీకి
- కాళేశ్వరం కమిషన్‌పై హైకోర్టు తీర్పు నేపథ్యంలో న్యాయసలహా కోసం పయనం
- ఎమ్మెల్యేల ఫిరాయింపులపైనా న్యాయపరమైన కార్యాచరణకు సన్నాహాలు

2లో

హరీశ్‌తో పాటు వినోద్ కుమార్, వద్దిరాజు రవిచంద్ర కూడా ఢిల్లీకి





## జమ్ముకాశ్మీర్‌లో
# ఘోర ప్రమాదం

### బస్సు బోల్తాపడి 15మంది మృతి

శ్రీనగర్, ఏప్రిల్ 24 (నినాదం) : జమ్మూ కాశ్మీర్ కాగోర్ట్ సమీపంలోని రామ్‌నగర్- ఉదంపూర్ జాతీయ రహదారిపై బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 15 మంది ప్రయాణికులు మరణించారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్య చికిత్స కోసం వారిని ఉదంపూర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఈ ప్రమాద ఘటనపై సమాచారం అందుకోగానే జిల్లా ఉన్నతాధికారులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు

2లో

## కావాలనే రేంవత్ సభకు పోటీ

### జగిత్యాల సభపై మండిపడ్డ పిసిసి చీఫ్



హైదరాబాద్, ఏప్రిల్ 24 (నినాదం) : సీఎం రేవంత్ రెడ్డి రైతుసభకు సభకు పోటీగా కేసీఆర్ సభ పెట్టారని తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు.రేవంత్ సభ 20 రోజుల ముందే ఫిక్స్ అయిందని

2లో



## మంచి మిత్రుడు, కృషీవలుడు..
## చంద్రబాబుకు ప్రధాని మోదీ బర్త్ డే విషెస్


- ఏపీ సీఎం చంద్రబాబుకు ప్రధాని మోదీ జన్మదిన శుభాకాంక్షలు

2లో

## డీఎంకే పాలనలో ప్రజల మధ్య
# విద్వేషాలు రగిల్చారు

### కోయంబత్తూరులో చంద్రబాబు ఎన్నికల ప్రచారం

*మహిళా రిజర్వేషన్ బిల్లు, డిలిమిటేషన్ బిల్లును అడ్డుకుని డీఎంకే సహా ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలు చారిత్రక తప్పిదం చేశాయని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శించారు. వారి తప్పుడు నిర్ణయం వల్ల మహిళలకు, దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తమిళనాడులోని కోయంబత్తూరులో ఎన్డీఏ అభ్యర్థుల తరపున అసెంబ్లీ ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆయన, స్థానిక వ్యాపారవేత్తలు, వివిధ రంగాల నిపుణులతో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎంకే, దాని మిత్రపక్షాల వైఖరిని తీవ్రంగా తప్పుపట్టారు.*



కోయింబత్తూరు, ఏప్రిల్ 24 (నినాదం) :

**మహిళలు, దక్షిణాదికి తీరని ద్రోహం**

ప్రధాని నరేంద్ర మోదీ చొరవతో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని చట్టం తీసుకువస్తే.. డీఎంకే, తృణమూల్ కాంగ్రెస్, కాంగ్రెస్ వంటి పార్టీలు దానిని వ్యతిరేకించాయని చంద్రబాబు మండిపడ్డారు. అదేవిధంగా, కేంద్రం ప్రతిపాదించిన డిలిమిటేషన్ బిల్లుతో దక్షిణ భారతదేశానికి సీట్లు పెరగవని అపోహ సృష్టించారని, వాస్తవానికి ఈ బిల్లుతో కనీసం 50 శాతం మేర సీట్లు పెరిగి దక్షిణాదికి మేలు జరిగేదని వివరించారు. "గడచిన 30 ఏళ్లుగా మహిళలు తమకు 33 శాతం రిజర్వేషన్ వస్తుందని ఎదురు చూస్తున్నారు. గతంలో దేవెగౌడ ప్రధానిగా ఉన్నప్పుడు ఈ బిల్లు తీసుకువస్తే కాంగ్రెస్ అడ్డుకుంది. ఇప్పుడు మోదీ ప్రభుత్వం తెస్తే ఇండి కూటమి పార్టీలు అడ్డుకున్నాయి. మహిళలకు అదనంగా సీట్లు పెంచే ప్రయత్నాన్ని వ్యతిరేకించడం ద్వారా మహిళా సాధికారతను నిలిపేశారు. దీనిపై ఆ పార్టీలు మహిళలకు సమాధానం చెప్పాలి" అని చంద్రబాబు డిమాండ్ చేశారు.
డీఎంకే పాలనలో తమిళనాడు విధ్వంసం

2లో

- తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఏపీ సీఎం చంద్రబాబు
- కోయంబత్తూరులో స్థానిక వ్యాపారవేత్తలు, వివిధ రంగాల నిపుణులతో సమావేశం
- డీఎంకే, దాని మిత్రపక్షాల వైఖరిపై విమర్శల వర్షం
- డీఎంకే పాలనలో రాష్ట్రం వెనుకబడిపోయిందని విమర్శలు
- ఏఐఏడీఎంకే నేతృత్వంలోని ఎన్డీఏ కూటమిని గెలిపించాలని పిలుపు

నినాదం
తెలుగు దిన పత్రిక
నిఖార్సైన జర్నలిజం
సోమవారం ఏప్రిల్ 20 2026
ninadam.in

## సచివాలయ వ్యవస్థ పటిష్టతకు కీలక అడుగు..
# 19 మందికి జిల్లా అధికారులుగా పోస్టింగ్

- సచివాలయాల వ్యవస్థ పటిష్టతకు ప్రభుత్వం కీలక నిర్ణయం
- 19 మంది అధికారులను జిల్లా స్వర్ణ గ్రామ, వార్డు ఆఫీసర్లుగా నియామకం
- పంచాయతీ రాజ్ శాఖ నుంచి డిప్యూటేషన్‌పై అధికారుల బదిలీ




**అమరావతి, ఏప్రిల్ 24 (నినాదం) :** ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ, వార్డు సచివాలయాల (జీఎస్‌డబ్ల్యూఎస్) వ్యవస్థను మరింత పటిష్టం చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. పర్యవేక్షణ, సమన్వయాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా 19 మంది అధికారులను జిల్లా స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు ఆఫీసర్లుగా (డీఎస్‌డీఎస్‌డబ్ల్యూవో) నియమిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు విభాగం ఉత్తర్వులు విడుదల చేసింది. సచివాలయాల కోసం మూడంచెల పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంలో భాగంగా ఈ నియామకాలు జరిగాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో ఇటీవల పదోన్నతులు పొందిన 20 మంది చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ల (సీఈవో) నుంచి 19 మంది సేవలను స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు విభాగానికి కేటాయించారు. వీరిని డిప్యూటేషన్ పద్ధతిపై వివిధ జిల్లాలకు డీఎస్‌జీఎస్‌డబ్ల్యూఓలుగా నియమించారు. తూర్పు గోదావరి, నంద్యాల, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, నెల్లూరు, పల్నాడు, పశ్చిమ గోదావరి, విశాఖపట్నం, ఏలూ రు, అన్నమయ్య, కోనసీమ, కాకినాడ, శ్రీకాకుళం, విజయనగరం, అనంతపురం, ఎన్టీఆర్, కర్నూలు, శ్రీసత్యసాయి, కృష్ణా జిల్లాలకు కొత్త అధికారులను కేటాయించారు. పోస్టింగులు పొందిన అధికారులు తక్షణమే తమకు కేటాయించిన ప్రదేశాల్లో విధుల్లో చేరాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నియామకాల ద్వారా జిల్లా, మండల స్థాయిల్లో సచివాలయాల పనితీరు మరింత మెరుగుపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

# హరీశ్ రావు ఢిల్లీ పర్యటన వెనుక పెద్ద ప్రణాళికే ఉంది

## - ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

- కేసీఆర్ బయటకు వస్తుంటే.. హరీశ్ ఢిల్లీకి వెళ్లరన్న చామల
- తన భవిష్యత్తుపై హరీశ్ స్పష్టతతో ఉన్నారని వ్యాఖ్య
- జీవన్ రెడ్డి చేరిక వల్ల బీఆర్ఎస్‌కు లాభం కంటే నష్టమే ఎక్కువన్న చామల

**హైదరాబాద్ , ఏప్రిల్ 24 (నినాదం) :** బీఆర్ఎస్ పార్టీ ఇప్పుడు మునిగిపోయే పడవలా మారిందని, ఆ పార్టీలో అంతర్గత విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. మాజీ మంత్రి హరీశ్ రావు ఢిల్లీ పర్యటనపై ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ ఏడాది తర్వాత ఫామ్‌హౌస్ నుంచి బయటకు వస్తుంటే, హరీశ్ రావు మాత్రం ఢిల్లీకి వెళ్లడం వెనుక పెద్ద వ్యూహమే ఉందని, ఆయన అక్కడ ఎవరిని కలిశారో త్వరలోనే బయటపడుతుందని పేర్కొన్నారు. హరీశ్ రావు తన భవిష్యత్తు ప్రణాళికలపై స్పష్టతతో ఉన్నారని ఆయన అభిప్రాయపడ్డారు. ఇటీవల బీఆర్ఎస్‌లో చేరిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అంశంపై స్పందిస్తూ.. ఆయన చేరిక ఆ పార్టీ నేతలకే ఇష్టం లేదని ఎంపీ అన్నారు. ముఖ్యంగా హరీశ్ రావు ఎప్పుడూ జీవన్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించలేదని, కేటీఆర్ బ్రతిమిలాడితేనే ఆయన జగిత్యాల వెళ్లారని గుర్తు చేశారు. జీవన్ రెడ్డి చేరిక వల్ల బీఆర్ఎస్‌కు లాభం కంటే నష్టమే ఎక్కువని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ జీవన్ రెడ్డికి సముచిత స్థానం ఇచ్చినా, ఆయన అక్కడ ఉంటూనే పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడారని మండిపడ్డారు. బీఆర్ఎస్‌లో చేరిన సీనియర్ నేతల



పరిస్థితి ప్రస్తుతం అగమ్యగోచరంగా ఉందని, జీవన్ రెడ్డి కూడా అక్కడ ఒక్కరోజు మాత్రమే వీఐపీ అని చామల ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ బలహీనపడిందని చూపించడానికే బీఆర్ఎస్ ఇలాంటి చేరికలను ప్రోత్సహిస్తోందని, కానీ క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ కు భవిష్యత్తు లేదని ఆయన స్పష్టం చేశారు.

## దక్షిణాదిపై జనసేన ఫోకస్..
# కేరళలో పార్టీ విస్తరణకు తొలి అడుగు

- కేరళలో పార్టీ బలోపేతంపై ఎమ్మెల్సీ నాగబాబు కీలక సమావేశం
- వివిధ పార్టీల నుంచి 200 మందికి పైగా నేతలు జనసేనలో చేరిక
- పవన్ కల్యాణ్ ఆదేశాలతోనే ఇతర రాష్ట్రాల్లో విస్తరణ అని ప్రకటన
- దక్షిణాది అంతటా పర్యటించి పార్టీని విస్తరిస్తామన్న నేతలు



**తిరువనంతపురం, ఏప్రిల్ 24 (నినాదం) :** ఏపీలో అధికారంలో భాగస్వామి అయిన జనసేన పార్టీ, ఇప్పుడు రాష్ట్ర సరిహద్దులు దాటి విస్తరించేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగా దక్షిణ భారతదేశంలోని ఇతర రాష్ట్రాలపై దృష్టి సారించింది. తొలి అడుగుగా కేరళలో పార్టీని బలోపేతం చేసేందుకు జనసేన నాయకత్వం నడుం బిగించింది. పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు, పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్ కేరళ రాజధాని తిరువనంతపురంలో పర్యటించారు. స్థానిక నేతల అభ్యర్థన మేరకు తిరువనంతపురంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేరళలో పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలు, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశం అనంతరం నాగబాబు, తాళ్లూరి రామ్ సమక్షంలో కేరళకు చెందిన వివిధ రాజకీయ పార్టీల నుంచి సుమారు 200 మందికి పైగా నాయకులు, కార్యకర్తలు జనసేనలో చేరారు. కాంగ్రెస్, రాష్ట్రీయ లోక్ దళ్, ఆల్ ఇండియా ముస్లిం లీగ్, నేషనల్ లేబర్ పార్టీ, హిందుస్థాన్ అవామీ మోర్చా వంటి పార్టీల నుంచి వచ్చిన వారికి కండువాలు కప్పి నాగబాబు సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నాగబాబు మాట్లాడుతూ.. దశాబ్దకాలం పాటు ప్రజాక్షేత్రంలో పోరాడి ఏపీలో అధికారంలోకి వచ్చామని, ఇక్కడి అభివృద్ధి, పాలన చూసి ఇతర రాష్ట్రాల వారు తమ ప్రాంతాల్లో జనసేనను విస్తరించాలనుకోవడం శుభపరిణామమని అన్నారు. ప్రాంతం, భాష వేరైనా జనసేన సిద్ధాంతాలు ఒక్కటేనని, అయితే స్థానిక అంశాలు, సమస్యలకు అనుగుణంగా పార్టీ విధానాలు ఉంటాయని స్పష్టం చేశారు. జనసేన ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్ మాట్లాడుతూ.. పవన్ కల్యాణ్ భావజాలం భాషలకు, ప్రాంతాలకు అతీతంగా ప్రజలను ఆకట్టుకుంటోందని తెలిపారు. దక్షిణ భారతదేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి పార్టీ విస్తరణ కోసం అభ్యర్థనలు వస్తున్నాయని, పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు భవిష్యత్తులో అన్ని రాష్ట్రాల్లో పర్యటించి జనసేనను విస్తరించే ప్రయత్నాలు చేస్తామని వివరించారు.

## చాలాకాలంగా వేధిస్తున్న సమస్య..
# డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు విజయవంతంగా సైనస్ సర్జరీ

- హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో ఎండోస్కోపిక్ విధానంలో చికిత్స
- పది రోజుల పాటు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని వైద్యుల సూచన
- చాలా ఏళ్లుగా సైనస్, ఇతర ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న పవన్



**హైదరాబాద్ , ఏప్రిల్ 24 (నినాదం) :** ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌కు శనివారం నాడు శస్త్రచికిత్స జరిగింది. శుక్రవారం అస్వస్థతకు గురవడంతో హైదరాబాద్, జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆసుపత్రిలో చేరిన ఆయనకు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆయనకు ముక్కుకు సంబంధించిన 'ఫంక్షనల్ ఎండోస్కోపిక్ సైనస్ సర్జరీ'ని విజయవంతంగా పూర్తి చేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, కోలుకుంటున్నారని వైద్య వర్గాలు తెలిపాయి. అయితే, వైద్యుల సూచన మేరకు పవన్ కల్యాణ్‌కు కనీసం 10 రోజుల పాటు పూర్తి విశ్రాంతి అవసరమని స్పష్టం చేశారు. పవన్ చాలా కాలంగా దీర్ఘకాలిక సైనసైటిస్ సమస్యతో బాధపడుతున్నారు. మందులతో తగ్గకపోవడంతో వైద్యులు శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించారు. ఎండోస్కోప్ ద్వారా నిర్వహించే ఈ సర్జరీలో సైనస్ మార్గాల్లో అడ్డంకులుగా ఉన్న పాలిప్స్‌ను, వాపును తొలగిస్తారు. భవిష్యత్తులో శ్వాస సంబంధిత ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఈ సర్జరీ దోహదపడుతుంది. సర్జరీ అనంతరం వారం రోజుల పాటు బరువులు ఎత్తడం, ముక్కును గట్టిగా చీదడం వంటివి చేయకూడదని వైద్యులు సూచించారు. గత కొన్నేళ్లుగా పవన్ సైనస్, ఆస్తమా, నడుం నొప్పితో పాటు తరచూ జ్వరాల బారిన పడుతున్నారు. రాజకీయాల్లోకి వచ్చాక పని ఒత్తిడి, దీక్షల కారణంగా ఆయన ఆరోగ్యంపై సరైన శ్రద్ధ పెట్టడం లేదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2018, 2024 సంవత్సరాల్లో తిరుమలకు నడకమార్గంలో వెళ్లినప్పుడు కూడా ఆయన తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఇప్పుడు సర్జరీ జరిగిన నేపథ్యంలో ఆయన ఆరోగ్యంపై మరింత శ్రద్ధ వహించాలని పార్టీ శ్రేణులు, అభిమానులు కోరుకుంటున్నారు.

# ప్రతి రంగంలో అవకాశాలను అందిపుచ్చుకునేలా దక్షిణ కొరియాతో భాగస్వామ్యం

## - ప్రధాని మోదీ



**ఢిల్లీ, ఏప్రిల్ 24 (నినాదం) :** ప్రతి రంగంలోనూ అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా దక్షిణ కొరియాతో భాగస్వామ్యం చేసుకుంటున్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ మూడు రోజుల పర్యటనలో భాగంగా భారతదేశానికి వచ్చారు. ఇరుదేశాల సంబంధాలు బలోపేతం అయ్యే దిశగా ప్రధాని మోదీ, లీ జే మ్యూంగ్ సమక్షంలో పలు అవగాహన ఒప్పందాలు జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన సంయుక్త మీడియా సమావేశంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ, చిప్స్ నుంచి షిప్స్ వరకు, టాలెంట్ నుంచి సాంకేతిక వరకు, ఎంటర్‌టైన్మెంట్ నుంచి ఎనర్జీ వరకు ప్రతి రంగంలో అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు తెలిపారు. వాణిజ్య ఒప్పందాల విలువ 2030 నాటికి 50 బిలియన్ డాలర్లకు చేర్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు.

# పేదల ఆకలి తీర్చే లక్ష్యంతో అన్న క్యాంటీన్లు

- విజయవాడ పటమటలో అన్నక్యాంటీన్ ప్రారంభం
- ఎన్టీఆర్ స్ఫూర్తితో ప్రారంభించామన్న చంద్రబాబు




**విజయవాడ, ఏప్రిల్ 24 (నినాదం) :** ప్రతి ఒక్కరి కడుపు నిండాలని.. ఎవరూ ఆకలిలో ఉండకూడదనేదే అన్న క్యాంటీన్ల ప్రధాన లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అన్న ఎన్టీఆర్.. తిరుమలలో ప్రారంభించిన అన్నప్రసాదం కార్యక్రమం స్ఫూర్తితో ఈ అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశామన్నారు. సోమవారం విజయవాడ పటమటలో అన్న క్యాంటీన్‌ను సీఎం చంద్రబాబు దంపతులు ప్రారంభించారు. అనంతరం సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. పేద వారికి కేవలం దానం చేసినట్లుగా కాకుండా, వారు గౌరవ ప్రదమైన వాతావరణంలో.. శుభ్రమైన, నాణ్యమైన పౌష్టికాహారాన్ని పొందేలా చూడటమే ఈ కార్యక్రమం ప్రత్యేకత అని చెప్పారు. ?ఇక్కడ ప్రత్యేకమైన క్యాంపస్, కాంపౌండ్ వాల్, పరిశుభ్రమైన వాతావరణం ఉంటుందని పేర్కొన్నారు. కేవలం రూ.5లకే ఉదయం, మధ్యాహ్నం, రాత్రి మూడు పూటలా భోజనం అందిస్తున్నారని వివరించారు. ఆటో డ్రైవర్లు, ముఠా కార్మికులు, రోడ్లు ఊడ్చేవారు, ఇతర సామాన్య ప్రజలకు ఇది ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇస్కాన్ ఫౌండేషన్ వారు సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా చాలా రుచికరమైన, నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్నారని గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 269 అన్న క్యాంటీన్లు పని చేస్తున్నాయని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. ఇటీవల 62 కొత్త క్యాంటీన్లను ప్రారంభించా మన్నారు. త్వరలోనే మరో 5 క్యాంటీన్లు ప్రారంభించి.. వాటి సంఖ్యను 274 కు చేర్చనున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లలో రూ.76 లక్షల వ్యయంతో మూడు పూటలా ఉచిత భోజనం అందించేందుకు ముందుకు వచ్చిన తన సతీమణి నారా భువనేశ్వరిని ఈ సందర్భంగా చంద్రబాబు అభినందనలతో ముంచెత్తారు. ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా.. ఒక పూట భోజనం లేదా ఒక రోజు క్యాంటీన్ ఖర్చును భరించడం ద్వారా ఈ అన్నదాన కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ప్రజలను కోరుతున్నామన్నారు. ఇది కేవలం ప్రభుత్వం చేసే పని మాత్రమే కాకుండా, ప్రజలందరూ ఒక స్ఫూర్తితో కలిసి రావాల్సిన వేదిక ఇది అని పేర్కొన్నారు. ప్రజలను ఆదుకునే కార్యక్రమాలు నిరంతరాయంగా జరగాల్సి ఉందన్నారు. ఇది కేవలం ఒక పూట ఆహారం అందించడంతో ముగిసిపోయేది కాకూడదని.. ?ప్రజల అభివృద్ధి కోసం దీర్ఘకాలిక ప్రణాళికలతో ముందుకు వెళ్లాల్సి ఉందని చెప్పారు. వారిని మనతో సమానంగా అన్ని రంగాల్లో పైకి తీసుకురావాల్సి ఉందని చెప్పారు.

సమాజంలో ఉన్న ఆర్థిక అసమానత లను తగ్గించే దిశగా ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అదే నిజమైన ప్రజాస్వామ్యం, సమాజానికి స్ఫూర్తి కూడా అని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అంటేనే 'అన్నపూర్ణ' అని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఎవరూ కూడా ఆకలితో అలమటించ కూడదన్నారు. గత ప్రభుత్వం పేదలకు అన్నం పెట్టే 'అన్న క్యాంటీన్లను' మూసివేసిందని విమర్శించారు. భోజనం పెట్టే వారిపై తప్పుడు కేసులు పెట్టి అరెస్ట్ చేయడం వారి ప్రవర్తనకు నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని పేదలను ఆదుకోవడానికి అందరూ కలిసికట్టుగా ముందుకు రావాలంటూ ప్రజలకు ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.



# ట్రంప్ చెబితే.. మోదీ ఇజ్రాయెల్ వెళ్లారు

## - రాహుల్ గాంధీ

**తూత్తుకుడి, ఏప్రిల్ 24 (నినాదం) :** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెప్పినట్లే ప్రధాని మోదీ ప్రవర్తిస్తున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీఆరోపించారు. తమిళనాడులోని తూత్తుకుడిలో జరిగిన ఎన్నికల సభలో ఆయన మాట్లాడుతూ.. ట్రంప్ ఆదేశాల ప్రకారమే మోదీ ఇజ్రాయిల్ పర్యటనకు వెళ్లినట్లు తెలిపారు. ఫిబ్రవరి 28వ తేదీన అమెరికా-ఇజ్రాయెల్ దళాలు అకస్మాత్తుగా ఇరాన్‌పై అటాక్ చేసిన విషయం తెలిసిందే. అయితే ఆ ఘటనకు మూడు రోజుల ముందే ప్రధాని మోదీ ఇజ్రాయెల్‌లో పర్యటించారు. ఆయన నెతన్యహూతో భేటీ అయ్యారు. ఈ అంశాన్ని రాహుల్ గాంధీ తన ఎన్నికల ప్రచార ప్రసంగంలో ప్రస్తావించారు. ఒకవేళ ట్రంప్ దూకమంటే, మోదీ దూకేస్తారని అన్నారు. ఇరాన్‌లో వార్ ప్రారంభంకావడానికి ముందు ట్రంప్ ఆదేశాల ప్రకారం మోదీ ఇజ్రాయెల్ వెళ్లి వచ్చారని, దానికి కారణం చాలా సింపుల్ అని, ఎప్‌స్టీన్ ఫైల్స్.. అదానీ అని రాహుల్ ఆరోపించారు.

# సత్తెనపల్లిలో నర్సు ఆత్మహత్య..

## ఆర్ఎంపీ వైద్యుడిపై ఆరోపణలు

**పల్నాడు జిల్లా, ఏప్రిల్ 24 (నినాదం) :** పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో విషాదం చోటుచేసుకుంది. స్థానిక వావిలాల నగర్‌లో గోవర్ధన (40) అనే వివాహిత ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆమె బలవన్మరణానికి పాల్పడినట్లు సమాచారం. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే, గోవర్ధన స్థానికంగా ఉన్న ఒక క్లినిక్‌లో నర్సుగా పనిచేస్తున్నారు. అయితే, ఆమె పనిచేస్తున్న క్లినిక్‌లోని ఆర్ఎంపీ డాక్టర్ కొట్టడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారని, ఆ కారణంగానే ఆత్మహత్య చేసుకున్నారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు. గోవర్ధన ఆత్మహత్యకు దారితీసిన కారణాలను తెలుసుకునేందుకు దర్యాప్తు ప్రారంభించారు.

# చెట్టును ఢీకొట్టి.. కొండపై కూలిన ప్రైవేట్ జెట్ విమానం



**రాయ్‌పూర్ ఏప్రిల్ 24 (నినాదం) :** ఒక ప్రైవేట్ జెట్ విమానం చెట్టును ఢీకొట్టింది. అదుపుతప్పిన అది కొండపై కూలింది. సంఘటనా స్థలంలో మంటలు, పొగలు కనిపించాయి. పోలీసులు, అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. (గ్రతీఅజ్ఞవ యివ్ ఎతీఖంష్ట్రవం) ఛత్తీస్‌గఢ్‌లోని జష్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. సోమవారం జష్‌పూర్ ఉ నారాయణ్‌పూర్ అటవీ ప్రాంతంపై తక్కువ ఎత్తులో ఎగురుతున్న ప్రైవేట్ జెట్ విమానం ఒక చెట్టును ఢీకొట్టింది. అదుపుతప్పిన ఆ విమానం కొండ వాలుపై కూలిపోయింది. దీంతో మంటలు, పొగలు కనిపించాయి. కాగా, ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు, అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కూలిన చార్టర్డ్ విమానంలోని పైలట్, కో పైలట్ మరణించినట్లు గుర్తించారు. ఈ విమానం కూలిన సంఘటనకు సంబంధించిన వీడియో క్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.



# కాళేశ్వరం ఆలయ అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి భూమిపూజ

- కాళేశ్వర ముక్తేశ్వరస్వామిని దర్శించుకున్న సీఎం
- రూ.198 కోట్లతో చేపట్టబోయే అభివృద్ధి పనులకు శ్రీకారం

**కాళేశ్వరం,ఏప్రిల్ 24 (నినాదం) :** కాళేశ్వరంలోని ఆలయ అభివృద్ధి పనులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూమి పూజ చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి తొలుత కాళేశ్వరంలోని కాళేశ్వర ముక్తేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం రూ.198 కోట్లతో చేపట్టబోయే ఆలయ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి భూమిపూజ చేశారు. అనంతరం మేడిగడ్డ బ్యారేజీకి చేరుకుని, ఎన్డీఎస్ఏ చైర్మన్ అనిల్ జైన్‌తో కలిసి బ్యారేజీని పరిశీలిస్తారు. ఇరిగేషన్ అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహిస్తారు. అక్కడి నుంచి కాటారం మండలం నస్తూరిపల్లికి వెళ్తారు. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతారు. ఈ సభలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా రెండో విడత నిధులను విడుదల చేస్తారు.

## ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు గడువు మరో మూడు రోజులు పొడిగింపు




**హైదరాబాద్ ఏప్రిల్ 24 (నినాదం) :** తెలంగాణలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు గడువును ఇంటర్మీడియట్ బోర్డు పొడిగించింది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి చెందిన రెగ్యులర్ విద్యార్థులతో పాటు , ఫెయిలైన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాయడానికి ఈనెల 23 వ తేదీ వరకు పొడిగించినట్లు తెలంగాణ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను నిర్వహించిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ పరీక్షల ఫలితాలు ఈనెల 12న విడుదలయ్యాయి. కాగా ఈ పరీక్షలో ఉత్తీర్ణులై మార్కులు ఎక్కువ సాధించాలని భావించే విద్యార్థులు, ఫెయిలైన విద్యారులకు మే 13 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. మే 22 నుంచి 25 వరకు ప్రాక్టికల్స్, మే 26న ఫస్టియర్, సెకండియర్ ఇంగ్లీష్ ప్రాక్టికల్స్, 28న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష, ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష నిర్వహించనున్నారు. తెలంగాణ సమాచారం

# చంద్రబాబుకు టిటిడి తరపున వేదాశీర్వచనం

**అమరావతి, ఏప్రిల్ 24 (నినాదం) :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 76వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని అమరావతిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో టిటిడి తరపున శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీ వేంకటేశ్వర స్వామివారి అనుగ్రహంతో టిటిడి అర్చకులు వేదాశీర్వచనం నిర్వహించారు. టిటిడి అదనపు ఈవో సి. హెచ్. వెంకయ్య చౌదరి స్వామివారి తీర్థ, ప్రసాదాలు, శ్రీవారి చిత్రపటాన్ని అందజేశారు. శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కృపాకటాక్షాలు ఆయనపై ఎల్లప్పుడూ ఉండాలని అర్చకులు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టిటిడి అధికారులు, అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

# జగన్ తీరు పాము తన గుడ్లను తానే తిన్నట్లుగా ఉంది

## - నిమ్మల రామానాయుడు



**విజయవాడ, ఏప్రిల్ 24 (నినాదం) :** ప్రజలు వైసీపీని రాజకీయాలకు దూరంగా పెట్టాలని పిలుపు వైసీపీ అధినేత జగన్ పై రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అమరావతిలో మీడియాతో మాట్లాడిన ఆయన.. జగన్ తీరు 'పాము తన గుడ్లను తానే తిన్నట్లు'గా ఉందని అభివర్ణించారు. జగన్ కు అధికార దాహం, ధన దాహం ఎక్కువని... వాటి కోసం కోసం జగన్ ఎవరినైనా బలి చేస్తారని, ఆయనకు తల్లైనా, చెల్లైనా, బాబాయ్ అయినా ఒకటేనని ఎద్దేవా చేశారు. జగన్ నడిపిస్తున్నది క్రిమినల్ రాజకీయాలని, వైసీపీ కార్యకర్తలు ఇప్పటికైనా వాస్తవాలను గ్రహించాలని హితవు పలికారు. ఇటీవల జరిగిన వైసీపీ కార్యకర్త పెద్ద దస్తగిరి హత్యపై మంత్రి స్పందిస్తూ.. ఇది జగన్ స్వార్థానికి పరాకాష్ఠ అని ఆరోపించారు. జగన్ సన్నిహితుడు నిత్యానంద రెడ్డి ఈ హత్యకు పాల్పడటం వెనుక తాడేపల్లి ప్యాలెస్ అనుబంధమే కారణమని పేర్కొన్నారు. హింసా రాజకీయాలు చేసేవారికి ఆంధ్రప్రదేశ్‌లో చోటు లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర శ్రేయస్సు కోరి ప్రజలు వైసీపీని రాజకీయంగా దూరం పెట్టాలని మంత్రి నిమ్మల రామానాయుడు పిలుపునిచ్చారు.

# నినాదం

తెలుగు దిన పత్రిక

నిఖార్సైన జర్నలిజం

EVENING 6 PM

డిజిటల్ ఎడిషన్

సోమవారం ఏప్రిల్ 20 2026

ninadam.in






## రేసింగ్ ట్రాక్‌పై హీరో అజిత్ సత్తా..

### బెల్జియంలో రెండో స్థానంలో టీం!


- మిచెలిన్ 12H ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటిన 'అజిత్ కుమార్ రేసింగ్ బై రెడ్ యాంట్'
- 992-AM కేటగిరీలో పోడియం ఫినిష్ సాధించిన బృందం
- ఈ సీజన్‌లో అజిత్ టీంకు ఇది మూడో పోడియం విజయం

**బెల్జియం, ఏప్రిల్ 24 (నినాదం) :** ప్రముఖ సినీ నటుడు అజిత్ కుమార్ సహ యజమానిగా ఉన్న రేసింగ్ టీం అంతర్జాతీయ స్థాయిలో మరోసారి సత్తా చాటింది. బెల్జియంలోని ప్రఖ్యాత స్పే ఫ్రాంకోర్‌చాంప్స్ సర్క్యూట్‌లో జరిగిన మిచెలిన్ 12H రేసులో 'అజిత్ కుమార్ రేసింగ్ బై రెడ్ యాంట్' టీం రెండో స్థానంలో నిలిచి పోడియంను కైవసం చేసుకుంది. ఈ విజయంతో భారత మోటార్‌స్పోర్ట్స్ అభిమానులు గర్వంతో ఉప్పొంగిపోతున్నారు. 2025 మిచెలిన్ 24H సిరీస్ యూరోపియన్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా ఈ పోటీ జరిగింది. ఏప్రిల్ 19, 20 తేదీల్లో రెండు భాగాలుగా నిర్వహించిన ఈ 12 గంటల ఎండ్యూరెన్స్ రేసులో అజిత్ టీం 992-AM క్లాస్‌లో బరిలోకి దిగింది. అజిత్ కుమార్‌తో పాటు ఫ్రాన్స్‌కు చెందిన ఫాబియన్ డ్యూఫియక్స్, బెల్జియంకు చెందిన మాథ్యూ విన్సెంట్ ఆర్ డెట్రీ డ్రైవర్లుగా వ్యవహరించారు. వీరు నడిపిన #901 పోర్షే 911 GT3 కప్ (992) కారు రేసులో అద్భుతమైన ప్రదర్శన కనబరిచింది. ఈ 2025 సీజన్‌లో అజిత్ రేసింగ్ టీం పోడియం ఫినిష్ సాధించడం ఇది మూడోసారి కావడం విశేషం. ఇంతకుముందు దుబాయ్‌లో జరిగిన 24H రేసులో, ఇటలీలోని ముగెల్లోలో జరిగిన 12H రేసులోనూ మూడో



స్థానంలో నిలిచింది. ఇప్పుడు బెల్జియంలో రెండో స్థానాన్ని సాధించి తమ నిలకడైన ప్రదర్శనను కొనసాగించింది. ఈ విజయంపై అజిత్ మేనేజర్ సురేష్ చంద్ర స్పందిస్తూ, "భారత మోటార్‌స్పోర్ట్స్‌కు ఇది గర్వకారణమైన క్షణం. ప్రతిష్టాత్మక స్పే సర్క్యూట్‌లో అజిత్, అతని బృందం అద్భుతమైన P2 పోడియం ఫినిష్ సాధించారు. ప్రపంచ వేదికపై అభిరుచి, పట్టుదలకు ఇది నిదర్శనం" అని సోషల్ మీడియాలో పేర్కొన్నారు.

## అమెరికాలో కాల్పుల కలకలం.. ఎనిమిది మంది బాలల మృతి



**లూసియానా, ఏప్రిల్ 24 (నినాదం) :** అమెరికాలో మరోసారి కాల్పుల ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. లూసియానా రాష్ట్రంలోని ష్రీవ్‌పోర్ట్‌లో జరిగిన ఈ దారుణంలో 8 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. ఘటన అనంతరం పారిపోయేందుకు ప్రయత్నించిన నిందితుడిని పోలీసులు కాల్చి చంపారు. స్థానిక పోలీసుల వివరాల ప్రకారం.. లూసియానా రాష్ట్రం ష్రీవ్‌పోర్ట్ ప్రాంతంలో ఓ సాయుధుడు కాల్పులకు తెగబడ్డాడు. ఈ ఘటనలో 1 నుంచి 14 ఏళ్లలోపు వయసున్న ఎనిమిది మంది చిన్నారులు అక్కడికక్కడే మరణించారు. మృతుల్లో కొందరు నిందితుడి బంధువులు కూడా ఉన్నారని పోలీసులు ప్రాథమికంగా తెలిపారు. దాడుల తర్వాత నిందితుడు ఓ కారును అపహరించి పారిపోయాడు. పోలీసులు వెంబడించి పట్టుకునే ప్రయత్నం చేయగా, కాల్పులకు తెగబడ్డాడు. దీంతో తాము ఎదురుకాల్పులు జరపగా నిందితుడు చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం ఈ ఘటనపై పోలీసులు విస్తృత దర్యాప్తు చేస్తున్నారు.

## కేబుల్ బ్రిడ్జిపై హిట్ అండ్ రన్

- బెంజ్ కారు ఢీకొని వ్యక్తి మృతి



**హైదరాబాద్, ఏప్రిల్ 24 (నినాదం) :** హైదరాబాద్ లోని మాదాపూర్ కేబుల్ బ్రిడ్జిపై జరిగిన హిట్ అండ్ రన్ ప్రమాదం కలకలం రేపింది. అతివేగంగా వచ్చిన ఓ మెర్సిడెస్ బెంజ్ కారు ఢీకొనడంతో శ్యామ్ రాజ్ (32) అనే వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. జూబ్లీ హిల్స్ నుంచి ఐకియా వైపు వస్తున్న వెస్ట్ బెంగాల్ రిజిస్ట్రేషన్ కలిగిన బెంజ్ కారు బ్రిడ్జిపై ఆగి ఉన్న శ్యామ్ రాజ్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతడిని సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రమాదం అనంతరం కారు డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనలో కారు ఇంజన్ భాగం తీవ్రంగా దెబ్బతిన్నట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం కారును కొంత దూరం తీసుకెళ్లి అదే కేబుల్ బ్రిడ్జిపై పార్క్ చేసి, డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తి అక్కడి నుంచి తప్పించుకున్నారు. ప్రమాదం సమయంలో కారులో ఇద్దరు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన మాదాపూర్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి కారణమైన నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు.

## రూ. 250 కోట్లు కావాలంటున్న సంగీత..
## రూ. 35 కోట్లు ఇస్తానంటున్న విజయ్!

- కేసు జూన్ 15కు వాయిదా వేసిన కోర్టు
- భరణంపై కోర్టు బయట బేరసారాలు
- ఎన్నికల అఫిడవిట్ ఆధారంగా భరణం డిమాండ్
- 35 కోట్లు మాత్రమే ఇస్తానన్న విజయ్

**చెన్నై, ఏప్రిల్ 24 (నినాదం) :** కోలీవుడ్ స్టార్ హీరో, టీవీకే అధినేత విజయ్ వ్యక్తిగత జీవితం హాట్ టాపిక్ గా మారింది. ఒక వైపు రాజకీయంగా ప్రత్యర్థుల నుంచి విమర్శలు, మరోవైపు వైవాహిక బంధంలో ఒడిదుడుకులు ఇప్పుడు దళపతినిఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. విజయ్ భార్య సంగీత దాఖలు చేసిన విడాకుల పిటిషన్ పై చెంగల్పట్టు కోర్టు విచారణను జూన్ 15కు వాయిదా వేసింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల హీట్ పెరుగుతున్న నేపథ్యంలో ఈ పరిమాణాలు మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే విజయ్ - సంగీత జంట పరస్పర అంగీకారంతో విడిపోయేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు శనివారం చెన్నైలో ఇరువురి లాయర్లు కలిసి చర్చించినట్లు సమాచారం. విడిపోయేందుకు తాను సిద్ధంగా ఉన్నానని అయితే సెటిల్ మెంట్ కింద ఎన్నికల అఫిడవిట్ లో ప్రకటించిన ఆస్తుల ఆధారంగా , తన ఇద్దరు పిల్లలు భవిష్యత్తు కోసం సుమారు రూ. 250 కోట్లు భరణం సంగీత కోరినట్లు టాక్ వినిపిస్తోంది. అయితే విజయ్ మాత్రం సంగీతకు రూ. 35 కోట్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని సమాచారం. కుమారుడు, కుమార్తె బాగోగులు తాను చూసుకుంటానని విజయ్ గురిచేశారని, కనీస ఆర్థిక స్వేచ్ఛ కూడా ఇవ్వలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. తన కదలికలపై ఆంక్షలు విధించారని, మాటలతో తీవ్రంగా కించపరిచారని ఆమె వాపోయారు. తమిళనాడులో ఏప్రిల్ 23న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మే



అన్నట్లు తెలుస్తోంది. అయితే విడాకుల వ్యవహారం కోర్టులో విచారణ జరుగుతున్న నేపథ్యంలో దీనిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోదని సమాచారం. విజయ్ నుంచి విడాకుల కోసం ఈ ఏడాది ఫిబ్రవరిలో సంగీత పిటిషన్ దాఖలు చేశారు. అందులో ఆమె పేర్కొన్న అంశాలు కోలీవుడ్‌లో కలకలం రేపుతున్నాయి. విజయ్ ఒక నటితో వివాహేతర సంబంధం పెట్టుకున్నారని ఆరోపించారు. తనను మానసిక, శారీరక వేధింపులకు 4న ఫలితాలు వెలువడనున్నాయి. తన సొంత పార్టీ 'తమిళగ వెట్రి కళగం' ద్వారా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన విజయ్‌కు ఈ ఎన్నికలు అత్యంత కీలకం. అయితే, సరిగ్గా ఎన్నికల ప్రచార సమయంలో ఈ విడాకుల వ్యవహారం తెరపైకి రావడం ఆయనకు ప్రతికూలంగా మారుతుందా అన్న చర్చ సాగుతోంది. మరి ఈ విడాకుల వ్యవహారం రాజకీయంగా ఎలాంటి ప్రభావం చూపుతుందో చూడాలి మరి.

## గర్భిణుల ఆపద్బంధు 108 ఇంట్లోనే డెలివరీ చేసిన 108 సిబ్బంది

**మంచిర్యాల, ఏప్రిల్ 20(నినాదం):** ఎక్కడ ఏ ప్రమాదం జరిగిన కుయ్ కుయ్ మంటూ క్షణాల్లో వచ్చే 108 అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు అందిస్తున్నాయి. రహదారి ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను ఆసుపత్రులకు తీసుకెళ్లడమే కాకుండా గర్భిణులను ఆస్పత్రికి తరలిస్తున్నారు. ఈ క్రమంలో గర్భిణులకు పురిటి నొప్పులు ఎక్కువైతే అంబులెన్స్ లోనే 108 సిబ్బంది ఫోన్ ద్వారా వైద్యుల సలహా మేరకు డెలివరీ చేస్తున్నారు. తాజాగా ఓ గర్భిణీకి పురిటి నొప్పులు రావడంతో సిబ్బంది ఇంటికి వెళ్లి న డెలివరీ చేశారు. ఈ సంఘటన మందమర్రి మండలంలో జరిగింది. జార్ఖండ్ కు చెందిన తుడుమిత్ర అనే మహిళ మందమర్రి మండలం పులిమడుగు వద్ద ఓ సిరామిక్ కంపెనీలో పనిచేస్తుంది. ఆదివారం రాత్రి ఆమెకు పురిటి నొప్పులు ఎక్కువ అయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు 108 కి సమాచారం అందించారు. నస్పూర్ 108 అంబులెన్స్ నివాసానికి వెళ్లగా పురిటి నొప్పులు ఎక్కువ అయ్యాయి. 108 ఈఎంటి సతీష్, పైలట్, పైలట్ దేవయ్య ఇద్దరూ చాకచక్యంగా వ్యవహరించి ఫోన్ ద్వారా వైద్యుల సలహా మేరకు ఇంటి వద్దనే ప్రసవం చేశారు. ఆమె మగ బిడ్డను జన్మనిచ్చింది. అనంతరం తల్లి బిడ్డను మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇంట్లోనే డెలివరీ చేసి తల్లి బిడ్డను కాపాడిన 108 సిబ్బందిని మహిళ



కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. అంతేకాక స్థానికులు సైతం హర్షం వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్, జిల్లా ఈఎంఈ కొండల్ సిబ్బందిని అభినందించారు.

## రేవంత్‌తో భేటీపై కేంద్రమంత్రి వర్మ క్లారిటీ

- అది రాజకీయ సమావేశం కాదని, పరిపాలనాపరమైనదేనని స్పష్టీకరణ
- ఎలక్ట్రిక్ బస్సుల విడుదల కోసమే రేవంత్ వచ్చారని వెల్లడి
- భేటీపై సోషల్ మీడియాలో అనవసర ట్రోలింగ్ జరిగిందని ఆక్షేపణ

**ఢిల్లీ, ఏప్రిల్ 24 (నినాదం) :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తానిచ్చిన అల్పాహార విందుపై చెలరేగిన రాజకీయ దుమారంపై కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ స్పందించారు. ఆ భేటీకి ఎలాంటి రాజకీయ ప్రాధాన్యత లేదని, కేవలం పరిపాలనా అవసరాల దృష్ట్యానే జరిగిందని ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీలో శ్రీనివాస వర్మ తన నివాసంలో ఇటీవల తెలుగు రాష్ట్రాల ఎంపీలకు అల్పాహార విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి హెచ్.డి. కుమారస్వామితో పాటు సీఎం రేవంత్ రెడ్డి కూడా హాజరయ్యారు. పార్లమెంట్‌లో 131వ రాజ్యాంగ సవరణ బిల్లును కాంగ్రెస్ వ్యతిరేకించిన మరుసటి రోజే ఈ భేటీ జరగడంతో, బీజేపీ-కాంగ్రెస్ మధ్య రహస్య ఒప్పందం ఉందంటూ బీఆర్ఎస్ విమర్శలు గుప్పించింది. సోషల్ మీడియాలోనూ ఈ భేటీపై పెద్ద ఎత్తున చర్చ జరిగింది. ఈ విమర్శలపై స్పందించిన శ్రీనివాస వర్మ, తెలంగాణకు తమ శాఖ నుంచి మంజూరైన ఎలక్ట్రిక్ బస్సులను త్వరగా విడుదల చేయాలని కోరేందుకే రేవంత్ రెడ్డి తనను కలిశారని



తెలిపారు. ఈ మేరకు వినతిపత్రం అందించేందుకు వచ్చిన ఆయన, అల్పాహార విందుకు హాజరయ్యారని వివరించారు. ఇదే సమావేశంలో బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అంశాన్ని కూడా రేవంత్ ప్రస్తావించినట్లు సమాచారం. ఈ చిన్న అంశాన్ని కొందరు కావాలనే రాజకీయం చేస్తూ సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని శ్రీనివాస వర్మ ఆక్షేపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయంలో భాగంగానే ఈ సమావేశం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

## అమెరికా చరిత్రలో అతిపెద్ద రిఫండ్

### సుప్రీంకోర్టు తీర్పుతో సుంకాల తిరిగి చెల్లింపు




**వాషింగ్టన్, ఏప్రిల్ 24 (నినాదం) :** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాలు చెల్లుబాటు కావంటూ అక్కడి సుప్రీంకోర్టు తీర్పు వెల్లడించిన నేపథ్యంలో సుంకాల తిరిగి చెల్లింపు పక్రియ ప్రారంభమైంది. అమెరికా కస్టమ్స్ బోర్డర్ ప్రొటెక్షన్ ఇందుకోసం ఆన్‌లైన్ సిస్టమ్‌ను తీసుకొచ్చింది. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 8 గంటల నుంచి దిగుమతిదారులు, వారి బ్రోకర్లు క్లెయిమ్‌లను సబ్మిట్ చేయొచ్చు. అమెరికా చరిత్రలో ఇది అతిపెద్ద రిఫండ్ పక్రియగా నిలవనుంది. గతేడాది ట్రంప్ వివిధ దేశాలపై ఎడాపెడా సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. అయితే, 1977 నాటి అత్యవసర అధికారాల చట్టం కింద ట్రంప్ ఈ సుంకాలను విధించడం రాజ్యాంగ విరుద్ధమని ఈ ఏడాది ఫిబ్రవరి 20న సుప్రీంకోర్టు 6-3 మెజారిటీతో తీర్పునిచ్చింది. పన్నులు విధించే అధికారం కాంగ్రెస్‌కు మాత్రమే ఉంటుందని స్పష్టంచేసింది. సుంకాలు చెల్లుబాటు కాకపోవడంతో ఆ మొత్తం రిఫండ్ చేయాలని కోర్టు ఆదేశించింది. ఈ సుంకాలను చెల్లించిన వ్యాపార సంస్థలు, దిగుమతిదారులు ఈ రిఫండ్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ట్రంప్ వెలువరించిన ఉత్తర్వుల అనంతరం 3.30 లక్షల మంది దిగుమతిదారులు దాదాపు 166 బిలియన్ డాలర్లను సుంకాల రూపంలో చెల్లించారు. ఇందులో 56,497 మంది దిగుమతిదారులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వారికి వడ్డీతో కలిపి సుమారు 127 బిలియన్ డాలర్లు ప్రస్తుతం వాపసు ఇవ్వడానికి ట్రంప్ సర్కారు సిద్ధమవుతోంది. క్లెయిమ్‌లు ఆమోదం పొందిన తర్వాత సుమారు 60 నుంచి 90 రోజుల్లో డబ్బు తిరిగి రానుంది. సాంకేతిక సమస్యల వల్ల కొంత ఆలస్యం జరగొచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. ఇటీవల చెల్లించిన సుంకాలను ముందుగా వాపస్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంటే తొలుత చెల్లించిన వారికి ఆలస్యం కానుంది. దిగుమతిదారులు తాము పొందిన రిఫండ్‌ను వినియోగదారులకు పంచాల్సిన అవసరం లేదు. అయితే, ఫెడ్‌ఎక్స్ వంటి కొన్ని సంస్థలు మాత్రం తమ కస్టమర్లకు ఈ ప్రయోజనాన్ని బదిలీ చేస్తామని వెల్లడించడం గమనార్హం.

## హర్మ్యూజ్ వద్ద నౌకలకు నేవీ అడ్వైజరీ

- అనుమతి ఇచ్చే వరకు వెళ్లొద్దన భారత నేవీ
- రష్యా చమురు దిగుమతికి బీమా సంస్థల సేవలకు అనుమతి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 24 (నినాదం) :** హర్మ్యూజ్ జలసంధిలో భారత జెండాతో ప్రయాణిస్తున్న రెండు నౌకలపై ఇరాన్ బలగాలు కాల్పులు జరిపిన నేపథ్యంలో భారత పతాక నౌకలకు మన నౌకదళం అడ్వైజరీ జారీ చేసిందని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. లారక్ ఐలాండ్‌కు దూరంగా ఉండాలని, తమనుంచి ఆదేశాలు వచ్చిన తర్వాతే హర్మ్యూజ్‌లో ప్రయాణించాలని నేవీ పేర్కొంది. ఆ జలసంధిని దాటేందుకు వేచి ఉన్న నౌకల భద్రతను నిర్ధారించేందుకే ఈ సూచనలని. లారక్ ద్వీపం హర్మ్యూజ్‌కు సమీపంలో ఉంటుంది. యుద్ధం ప్రారంభమైన దగ్గరి నుంచి 11 నౌకలు ఈ జలమార్గాన్ని దాటాయి. దానిని దాటిన చివరి ట్యాంకర్ దేశ్ గరిమ . అదే రోజు జగ్ అర్ణవ్, సన్మార్ హెరాల్డ్ ఈ మార్గంలో ప్రయాణిస్తుండగా.. ఇరాన్ బలగాలు కాల్పులు జరిపాయి. ఈ ఘటనను విదేశాంగశాఖ ఖండించిన సంగతి తెలిసిందే. భారత్‌లోని ఇరాన్ రాయబారి మహమ్మద్ ఫతాలీని పిలిపించి ఈ ఘటనపై నిరసనను తెలియజేసింది. గతంలో తమ దేశానికి బయల్దేరిన అనేక నౌకల సురక్షిత




ప్రయాణానికి ఇరాన్ సహకరించిందని ఈ సందర్భంగా గుర్తుచేసింది. ఇకపోతే భారత్‌కు చమురు సరఫరాలో ఆటంకాలు లేకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకొంటోంది. తాజాగా రష్యా నుంచి చమురు దిగుమతికి అవసరమైన బీమా సేవలను విస్తృతం చేయాలని నిర్ణయించింది. దీనిలోభాగంగా 11 రష్యా బీమా సంస్థలకు భారత్‌లో అనుమతులు మంజూరు చేసింది. వాస్తవానికి ఈ సంస్థలు నౌకా రవాణాలో బీమాలను అందించే పీ అండ్ ఐ క్లబ్స్ (ప్రొటెక్షన్ అండ్ ఇండెమ్నిటీ)లో మెంబర్స్ కాకపోవడం గమనార్హం. ఇరాన్-అమెరికా పోటీపడి హర్మ్యూజ్‌ను దిగ్బంధించడంతో చమురు నౌకలు ఈ జలసంధిని దాటడం చాలా కష్టంగా మారింది. మరోవైపు రష్యాకు చెందిన చాలా చమురు నౌకలు ఈ మార్గంలో కాకుండా ఎర్ర సముద్రం మీదుగా ఆసియాలోని తమ గమ్యస్థానాలకు చేరతాయి. అందుకే భారత్ మాస్కో వైపు మొగ్గు చూపింది. వీటిల్లో గ్యాస్‌ప్రోమ్ ఇన్సూరెన్స్, రోస్‌గోస్‌ట్రాక్, బ్యాలెన్స్, సోగ్లాసీ, ఉగోరియా గ్రూప్, స్బెర్‌బ్యాంక్, ఏఎస్‌టీకే బీమా సంస్థలు ఈ జాబితాలో ఉన్నాయి. రష్యా నుంచి చమురు కొనుగోళ్లకు గత వారం అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్ కూడా అనుమతులను పొడిగించింది. ఐరోపా కేంద్రంగా పనిచేసే 'ఇంటర్నేషనల్ గ్రూప్ ఆఫ్ పీఅండ్ఐ క్లబ్స్' సంస్థే థర్డ్‌పార్టీ, పొల్యూషన్, కార్గో డ్యామేజ్ వంటివి కవర్ చేస్తూ అత్యధికంగా బీమా పాలసీలు ఇస్తాయి. ప్రపంచ సముద్ర రవాణాలో ఈ సంస్థ వాటా 87శాతం వరకు ఉంది. అమెరికా ఆంక్షలు ఉన్న నేపథ్యంలో ఈ సంస్థ రష్యా నౌకలకు బీమా పాలసీలు ఇవ్వదు.

## కెటిఆర్ తీరుపై మండిపడ్డ ఎమ్మెల్యే సంజయ్

- అక్రమ సంపాదనతో వచ్చిన అహంకారమని విమర్శ

**జగిత్యాల, ఏప్రిల్ 24 (నినాదం) :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌దే క్రాస్‌బ్రీడ్ అని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం సంజయ్ కుమార్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. జీవన్ రెడ్డి కాంగ్రెస్‌ను వీడి బిఆర్ఎస్‌లో చేరబోతున్న సమయంలో తనపై వచ్చిన విమర్శలకు ఆయన తీవ్రంగా స్పందించారు. ఆయన జగిత్యాలలో మీడియాతో మాట్లాడుతూ.. తనను క్రాస్ బ్రీడ్ నాయకుడని కేటీఆర్ సంబోధించడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 'నేను రాజకీయ వ్యభిచారినైతే.. నువ్వు వ్యభిచార కొంప నడిపావా? గతంలో వైసీపీ, కాంగ్రెస్, టీడీపీ, సీపీఐ ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకున్న నీదా క్రాస్ బ్రీడ్..? నాదా..?' అని కేటీఆర్‌ను నిలదీశారు. గతంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో చంద్రశేఖర్ గౌడ్‌ను నిలబెట్టి.. జీవన్‌రెడ్డికి క్రాస్ ఓటేయించిన క్రాస్‌బ్రీడ్ నాయకుడు కేటీఆర్.. అక్రమ



సంపాదనతో వచ్చిన అహంకారంతో మాట్లాడుతు న్నారని మండిపడ్డారు. కల్వకుంట్ల కుటుంబ అహంకారపూరిత వ్యాఖ్యలతోనే రాష్ట్రంలో వెలమ జాతి గౌరవం తగ్గుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కేటీఆర్ రాజకీయాల్లోకి రాక ముందు నుంచే తానూ తన కుటుంబం రాజకీయాల్లో ఉన్నామన్న సంజయ్.. రాజకీయాల్లోకి వచ్చాక తన ఆస్తులు తగ్గాయే తప్ప పెరగలేదని స్పష్టం చేశారు.

### జగ్గంపేట ఎంపిడివో

## హఠాన్మరణం

**విజయవాడ, ఏప్రిల్ 24 (నినాదం) :** జగ్గంపేట మండల పరిషత్ డిప్యూటీ ఎంపిడిఓ ఎ.వి.వి.ఎస్ ఎన్ మూర్తి (55) సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. గత ఏడాది బదిలీల్లో ఆయన రంగంపేట నుండి జగ్గంపేట సీనియర్ అసిస్టెంట్ గా వచ్చారు. కొద్ది నెలల్లోనే డిప్యూటీ ఎంపిడిఓ గా పదోన్నతి పొంది ఇక్కడే విధులు నిర్వహిస్తున్నారు. ఆయన మృతి పట్ల ఎంపిడిఓ ఎ వి ఎస్ చంద్రశేఖర్, తహసీల్దార్ జె వి ఆర్ రమేష్, సచివాలయాల డిప్యూటీ ఎంపిడిఓ శ్రీనివాస రెడ్డి, అర్ డబ్ల్యూ ఎస్ ఎఈ రాంజీ, ఉపాధి హామీ ఎపిఓ రమణ కుమార్, పిడిఓ లు కె శివ, శ్రీనివాస్, నరసింహమూర్తి, నూకరాజు, ఉషారాణి, తదితర సిబ్బంది సంతాపం తెలిపారు.

## అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో మంటలు

- ఫైర్ సిబ్బంది రాకతో తప్పిన ముప్పు

**హైదరాబాద్, ఏప్రిల్ 24 (నినాదం) :** గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం అగ్నిప్రమాదం సంభవించింది. అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో అపార్ట్‌మెంట్ మొత్తం దట్టమైన పొగ అలముకుంది. ఈ ఘటనలో ఇద్దరు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. బిల్డింగ్ సెల్లార్‌లో షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగినట్లు అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో సెల్లార్‌లోని 15 ద్విచక్ర వాహనాలు అగ్నికి ఆహుతయ్యాయి. తీవ్ర అస్వస్థతకు గురైన ఇద్దరిని స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

## వంద రూపాయల అప్ప ఇవ్వనందుకు దాడి

- దంపతులపై దాడిలో భర్త మృతి

**మంచిర్యాల, ఏప్రిల్ 24 (నినాదం) :** మంచిర్యాలలో దారుణం చోటుచేసుకుంది. అప్పు ఇవ్వలేదన్న కోపంతో ఓ వ్యక్తి ఘాతుకానికి ఒడిగట్టాడు. దంపతులపై కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో భర్త చనిపోగా.. భార్య పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. దండేపల్లి మండలం ముత్యంపేటకు చెందిన శంకరయ్య దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆదివారం ఓ వ్యక్తి దుకాణం దగ్గరకు వచ్చాడు. 100 రూపాయలు అప్పు ఇవ్వమని అడిగాడు. ఇందుకు శంకరయ్య ఒప్పుకోలేదు. దీంతో ఆ వ్యక్తి గొడవకు దిగాడు. గొడవ చిలికిచిలికి గాలివానలా మారింది. విచక్షణ కోల్పోయిన ఆ వ్యక్తి శంకరయ్యపై కత్తితో దాడి చేశాడు. అడ్డం వచ్చిన శంకరయ్య భార్యపై కూడా దాడి చేశాడు. దాడి అనంతరం అక్కడినుంచి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడ్డ శంకరయ్య దంపతులను స్థానికులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శంకరయ్య ప్రాణాలు విడిచాడు. ఆయన భార్య పరిస్థితి విషమంగా ఉంది. ఇక, సమాచారం అందుకున్న పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితుడి కోసం గాలిస్తున్నారు.